ప్రజాశక్తి
గురువారం 18 జులై 2024   8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



శాంతిభద్రతల పరిరక్షణలో

రాజీ పడను

- ప్రకాశం ఎస్పీ దామోదర్

8లో



నిష్పక్షపాతమైన సేవలందిస్తాం..

- మాదక ద్రవ్యాల నిరోధానికి త్వరలో హెల్ప్‌లైన్
- బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి

8లో

మొహర్రం వేడుకల్లో ఉద్రిక్తత

3లో

బదిలీల కోసం ఎదురుచూపులు

- ఇంకా ఏ నిర్ణయం తీసుకోని రాష్ట్ర ప్రభుత్వం
- పాలనపై జిల్లా అధికారులకు తగ్గిన శ్రద్ధ
- ఎలాగూ వెళతామనే భావనే కారణం



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

కలెక్టర్లు, ఎస్పీల బదిలీలకే నెల రోజులకు పైగానే వేచిచూశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే రాష్ట్రంలో ఐఏఎస్‌లు.. ఈ వారంలోనే ఐపిఎస్‌ల బదిలీలు చేపట్టింది. ఇపుడిప్పుడే బాధ్యతలు తీసుకుంటున్నారు. పాలనపై దృష్టిసారించే దిశగా అడుగులు వేస్తున్నారు. జిల్లా అధికారుల బదిలీల ప్రక్రియ మాత్రం ఇంకా సాగలేదు. జిల్లాలో కీలకమైన కలెక్టర్, ఎస్పీల బదిలీలే జరిగాయి. వీరి కింద పనిచేయాల్సిన జిల్లా అధికారులను కదిలించలేదు. బదిలీల కోసం జిల్లా అధికారులు ఎదురుచూస్తున్నారు. ఎన్నికల ముందు సొంత జిల్లాల నుంచి బదిలీపై వేర్వేరు జిల్లాల్లో పడ్డారు. వీళ్లంతా ఇప్పుడు తిరిగి సొంత జిల్లాలు, గతంలో పనిచేసిన జిల్లాలకు రావడానికి ఎదురుచూస్తున్నారు. అందుకోసం మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారు. సిఫార్సులు చేయించుకుంటున్నారు. గతంలో తెలుగుదేశం ముద్రపడి తెరచాటున ఉండే పోస్టుల్లో ఉండే ▶ 2లో

బదిలీల కోసం ఎదురుచూపులు

(మొదటిపేజీ తరువాయి)

అధికారులందూ ఇప్పుడు కీలకపోస్టుల్లో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మరో వైపు మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా అధికారులను తెచ్చుకునేందుకు అన్ని కోణాల్లో వెనుకాముందూ ఆలోచిస్తున్నారు. గతంలో పనిచేసిన ట్రాక్ రికార్డులను తెప్పించుకుని పరిశీలన చేస్తున్నారు. ఎన్నికల్లో ఎలా పనిచేశారన్న దానిపైనా సమాచారం తీసుకునే ముందుకు పోతున్నారు. అయితే బదిలీల ప్రక్రియలో కొంత జాప్యం జరుగుతోందన్న చర్చ ఉంది. ఇప్పటికే నెలరోజులు దాటింది. రాష్ట్రంలో కూటమి పాలన సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు, పథకాలను సమర్ధవంతంగా అమలు చేయాలన్నా కొత్త అధికారులు రంగంలోకి రావాల్సి ఉంది. ఇప్పటికే ఇసుక, పెన్షన్లు అమలులోకి వచ్చాయి. మిగతా శాఖల్లోనూ పాలన వేగం పుంజుకోవాలంటే ఇప్పుడున్న అధికారుల బదిలీలు జరగాలి. ఎవరుంటారో, ఎవరు పోతారో కూడా స్పష్టత లేదు. దీంతో అందరూ ఉదాసీనంగానే ఉన్నారు. ఎటూ ఇక్కడ నుంచి వెళతామనే భావనతో పనిలో సీరియస్‌గా కనిపించడం లేదు. పైగా గత ప్రభుత్వ హయాంలో ఉన్న అధికారులు కావడంతో పాత వాసనతోనే పనిచేస్తున్నారనే విమర్శలూ కొందరిపై వస్తున్నాయి. మత్స్యశాఖ అధికారి కొత్తపట్నం మండలంలో ఓ కార్యక్రమం ఏర్పాటు చేసి.. కలెక్టర్‌ను పిలిచారు. వైసిపి నేతలకు ముందుగా సమాచారం ఇచ్చి.. గంట ముందు తెలుగుదేశం నేతలకు సమాచారం ఇచ్చారని తెలిసింది. దీనిపై మండలానికి చెందిన అధికార పార్టీ నేతలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌కు పిర్యాదు చేశారు. ఇలాంటివి కూడా చోటుచేసుకుంటున్నాయి. కారణం బదిలీలు జరగకపోవడమే.. అన్ని కీలక శాఖల్లోనూ ఇదే తంతు కొనసాగుతోంది. కలెక్టర్ నిర్వహించే సమీక్షలకు కూడా మొక్కుబడిగానే పోతున్నారు. కాగితాలపై కాలయాపన చేస్తున్నారు. సీరియస్‌గా శాఖలకు సంబంధించిన ప్రణాళికల రూపకల్పనలో కనిపించడం లేదు. గతంలో ఏం జరుగుతుందో ఇప్పుడూ అదే జరుగుతోంది. కొత్త అధికారుల బృందం వచ్చేవరకూ ఈ పరిస్థితి తప్పదంటున్నారు. ఇప్పటికే పలువురు అధికారులకు సిఫార్సు లేఖలు కూడా ఇచ్చారు. బదిలీ ఖాయమని తెలిసిన అధికారులైతే బాధ్యతల్లో పట్టీపట్టనట్లుగా ఉంటున్నారు. కొన్ని శాఖల్లో ఎవరు వస్తారన్నదీ స్పష్టంగా ఉంది. ఇక జిల్లాస్థాయి అధికారుల బదిలీల ప్రక్రియ పూర్తయ్యాక మళ్లీ డివిజన్ స్థాయి అధికారుల బదిలీలు జరగాలి. ఆ తర్వాత మండలాల్లో తహశీల్దార్లు, ఎంపిడిఒలు.. కీలకంగా ఉంటాయి. పోలీసు శాఖలో డిఎస్పీలు, సిఐలు, ఆ తర్వాత ఎస్ఐల బదిలీలు జరగాలి. వీటిపై ఎమ్మెల్యేల శిబిరాల్లో తర్జనభర్జనలు నడుస్తున్నాయి. ఎమ్మెల్యేలు కూడా నియోజకవర్గాల్లో అధికారుల కోసం ఆచీతూచీ నిర్ణయాలు తీసుకుంటున్నారు. వచ్చేవారి వివరాలు తీసుకొని ఆరా తీస్తున్నారు. అంతా ఓకే అనుకుంటేనే సంబంధిత మంత్రికి లేఖ ఇస్తున్నారు. ఏదేమైనా బదిలీల ప్రక్రియ పూర్తయి కొత్త యంత్రాంగం పాలనపై పట్టు సాధించాలంటే కొద్ది నెలలు పట్టేలా ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

ట్రాక్టర్, బైకు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శింగరాయకొండ సమీపంలోని గొల్ల చెంచయ్య పెట్రోల్ బంకు వద్ద రహదారిపై చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో శింగరాయకొండ సుందర్‌నగర్‌కు చెందిన సుదర్శి హరి గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పీర్లు బావివద్దకు తరలిస్తున్న ముస్లిం సోదరులు

'పీర్లు శుద్ధి' ప్రశాంతం

ప్రజాశక్తి -కనిగిరి

మొహరం పర్వదిన సందర్భంగా పీర్లు సలాం కార్యక్రమం సందర్భంగా బుధవారం ఉదయం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో సాయంత్రం పీర్లుకు బావి వద్ద శుద్ధి కార్యక్రమం ప్రశాంతంగా నిర్వహించుకునేలా డిఎస్‌పి రామరాజు శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఇరువర్గాల వారికి నచ్చజెప్పారు. అనంతరం ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా పీర్లుకు బావి వద్ద శుద్ధి కార్యక్రమం జరిగేలా చూశారు. బొడ్డు చావిడి సెంటర్ వద్ద భారీగా పోలీసు బలగాలను ఏర్పాటు చేశారు. సిఐ దాసరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసుల పర్యవేక్షణలో పీర్లకు బావి వద్ద శుద్ధి చేసే కార్యక్రమం ప్రశాంతంగా జరిగే చూశారు.పీర్ల శుద్ధి ప్రశాంతంగా జరగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



ఎస్‌పికి మొక్క అందజేస్తున్న మురళీకృష్ణ

ఎస్‌పిని కలిసిన మండవ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన ఎఆర్. దామోదర్‌ను ప్రముఖ పారిశ్రామిక వేత్త, సూర్యశ్రీ దివ్యాంగుల ఛారిటబుల్ ట్రస్టు ఫౌండర్ మండవ మురళీకృష్ణ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్క అందజేసి.. శుభాకాంక్షలు తెలిపారు.



ఐజికి పుష్పగుచ్చం అందజేస్తున్న ఎస్‌పి

ఐజిని కలిసిన ఎస్‌పి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా : బాపట్ల ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన తుషార్ డూడి గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠిని బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు.

మొహర్రం వేడుకల్లో ఉద్రిక్తత

- ఇరు వర్గాల నడుమ ఘర్షణ రేపిన తప్పెట్ల వివాదం
- దేవాలయాల వద్ద తప్పెట్లు వద్దని ఒక సామాజిక వర్గం
- ఉండాల్సిందే అంటూ మరో సామాజిక వర్గం మొండి పట్టు
- విద్వేషాలు రగిలేలా అల్లరి మూకల చేష్టలు
- మూడుసార్లు వాయిదా పడిన పీర్ల సలాం
- ఘర్షణలను కట్టడి చేయలేకపోయిన పోలీసు యంత్రాంగం
- పీర్లతో వాహనాల రాకపోకల అడ్డగింత
- రంగ ప్రవేశం చేసిన ఎమ్మెల్యే, స్పెషల్ ఫోర్స్

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరిలో మొహరం పర్వదిన వేడుకలు బుధవారం ఉద్రిక్త పరిస్థితుల నడుమన జరిగాయి. శంఖవరానికి చెందిన పీర్లు, ఒంగోలు బస్టాండ్ సెంటర్, టకారిపాలెం పీర్లు బొడ్డు చావిడి సెంటర్ వద్ద ఎదురెదురు సలాం అందుకొని వెళ్లాల్సి ఉంది. అయితే బొడ్డుచావుడి సెంటర్‌లో గల వినాయక మందిరం, రామాలయం, కన్యకా పరమేశ్వరి ఆలయం, శ్రీకృష్ణ మందిరం ఉన్నాయని, గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం పెట్టుకున్న హద్దుల వరకు డబ్బులు మోగించుకోవాలని ఆలయాల వద్ద డప్పులు మోగించకుండా పీర్లు సలాం అందుకొని వెళ్లాలని ఒక సామాజిక వర్గం కోరింది. అయితే అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం డప్పుల మోతతోనే పీర్లు సలాం అందుకొని వెళ్తాయని మరొక సామాజిక వర్గం మొండి పట్టడం జరిగింది. దీంతో ఇరు సామాజిక వర్గాల నడుమ వివాదం తలెత్తింది. దీంతో పీర్లు సలాం అందుకునే కార్యక్రమం నిలిచిపోయింది. ఒక సామాజిక వర్గం పీర్లను తీసుకొని ఒంగోలు బస్టాండ్‌కు వెళ్లి రోడ్డుపై వాహనాలకు అడ్డంగా పెట్టి ట్రాఫిక్ నిలిచిపోయేలా చేశారు. పోలీసులు ఇరు వర్గాలకు సర్ది చెప్పి కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు విశ్వ ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలించలేదు. బొడ్డు చావిడి సెంటర్లో ఇరువర్గాలు తమ పంతం చెల్లాలంటూ మొండిపట్టు పట్టడం ఘర్షణకు దారి తీసింది. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పీర్ల ఊరేగింపు లో పాల్గొన్న అల్లరి మూకలు అసభ్య పదజాలంతో, హావభావాలతో విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రవర్తించారు. మతపరమైన జెండాలను ప్రదర్శించారు. మరొక సామాజికవర్గం అల్లరి మూకల చేష్టలు, రెచ్చగొట్టే ధోరణిని అడ్డుకునే ప్రయత్నంలో భాగంగా వారు కూడా జెండాలను ప్రదర్శించారు. పీర్లు సలాం అందుకనే ప్రక్రియ, వాహనాల రాకపోకలను అడ్డుకోవడం మూడు దఫాలుగా జరిగింది. మొహరం వేడుకల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను సరి చేసేందుకు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి రంగ ప్రవేశం చేశారు. ఇరు వర్గాలకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే ఉండగానే ఒక వర్గం డప్పులు కొట్టుకుంటూ పీర్లు సలాం అందుకొనే కార్యక్రమాన్ని పూర్తి చేశారు. పీర్లు సలాం అందుకున్న తర్వాత తామే నెగ్గామంటూ హావాభావాలను వ్యక్తం చేస్తూ రామాలయం వీధిలో గుండా మరో సామాజికవర్గం వెళ్లిపోయింది. ఈ ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నం చేసిన మరో సామాజికవర్గం అసహనానికి గురై ఆవేదన వ్యక్తం చేసింది.



వాహనాల రాకపోకలను పీర్లు అడ్డంపెట్టి అడ్డుకున్న ఒక సామాజిక వర్గం

పొదిలి: బుధవారం ఉదయం కనిగిరిలో మొహరం, తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా చోటు చేసుకున్న స్వల్ప ఘటన నేపథ్యంలో పొదిలి పట్టణంలో మొహరం సందర్భంగా పోలీసులు భారి భద్రత ఏర్పాటు చేశారు. ఎస్ఐ జి కోటయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్సరం హిందువుల పండుగ తొలి ఏకాదశి ఇదే రోజు కలిసి రావడంతో పోలీసులు గతం కంటే ఎక్కువగా ప్రత్యేక బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా మొహరం వేడుకలు

హిందూ, ముస్లింలు ఉమ్మడిగా కలిసి జరుపుకునే మొహరం వేడుకలు పొదిలి పట్టణంలో బుదవారం ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా పట్టణ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

ఏకాదశి వేడుకల్లో పాల్గొన్న గునుపూడి దంపతులు

తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా స్థానిక రథం రోడ్డులోని అంకాల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నారాయణి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా దేవస్థాన నిర్మాణ దాత గునుపూడి భాస్కర్, వీరి ధర్మపత్ని మాధవి, కుమారుడు చేతన్ బాబు అభిషేకాభి అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మశ్రీ రమణాచార్యులు, షిరిడి సాయిబాబా దేవస్థాన అధ్యక్షులు కలువా సత్యనారాయణ, సామి రాజా, సోమిశెట్టి చిరంజీవి, యాదాల వెంకటేశ్వర్లు, ఇన్నమూరి నారాయణ, కొండవీటి సాంబశివరావు మొదలగు మహిళా భక్తులు పాల్గొన్నారు.



ఇరు వర్గాలతో మాట్లాడుతున్న సీఐ



ఎమ్మెల్యే ఉండగానే పంతం నెగ్గించుకుని వెళ్తున్న ఒక సామాజిక వర్గం



పొదిలి పెదబస్టాండు వద్ద పోలీసుల బందోబస్తు

బోర్ల వైరు చోరీ

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం అక్కలరెడ్డిపల్లె గ్రామంలో బిల్లా వెంకటేశ్వర్లు, చిన్న రంగారెడ్డి, పెద్ద రంగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి అనే నలుగురు రైతుల పొలాల్లోని బోరు బావుల్లోని మోటార్ల వైరును దొంగలు దోచుకుపోయారు. కేవలం తమ నలుగురికి సంబంధించిన బోర్ల వైరు దోచుకుపోవడం పట్ల సంబంధిత రైతులు పలువురు వ్యక్తులపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పరిశుభ్రంగా సచివాలయాలు

ప్రజాశక్తి-కురిచేడు

ప్రజాశక్తి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన 'మందుబాబులకు అడ్డగా మారిన సచివాలయాలు' అనే శీర్షికతో కథనం వచ్చిన సంగతి పాఠకులకు విదితమే. ఈ కథనంపై కురిచేడు గ్రామ పంచాయతీ కార్యదర్శి షేక్ చాంద్‌బి వెంటనే స్పందించారు. సెలవు రోజైనప్పటికీ పంచాయతీ కార్మికులను అక్కడికి పంపి మొత్తం శుభ్రం చేయించారు. 2 రెండు రోజుల్లో సచివాలయ సిబ్బందిని మొత్తాన్ని అక్కడికి పంపించి ఆ కార్యాలయం నుండే కార్యకలాపాలను కొనసాగిస్తామని తెలిపారు.

నల్లమలలో నిలిచిపోయిన ట్రాఫిక్

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం దిగువమెట్ట నల్లమల అటవీ ప్రాంతంలో బుధవారం పాత రైల్వే వంతెన గోడను ఓ లారీ ఢీ కొట్టింది. దీంతో లారీ సాంకేతిక లోపానికి గురై అక్కడే రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. దీంతో అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై ఇరువైపులా వాహనాలు ఆగిపోయాయి. ఫలితంగా వాహన దారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు అధికారులు యంత్రాల సహాయంతో లారీని పక్కకు తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేయటంతో వాహనాలు వెళ్లిపోయాయి.



ఆగిన వాహనాలు

కుక్కల్లో వింత రోగాలు

మనుషులకూ సోకుతున్న వైనం

ప్రజాశక్తి-పీసీపల్లి



వింత వ్యాధితో ఉన్న కుక్క

ఈ మధ్యకాలంలో కుక్కల్లో వింత రోగాలు కనిపిస్తున్నాయి. ఈ కుక్కలను తాకిన వారికి కూడా ఆ రోగాలు అంటుకుంటున్నాయి. మొదట కుక్కల ఒంటి మీద ఉన్న వెంట్రుకలు ఊడిపోతాయి. ఆ తర్వాత నల్లగా మచ్చలు ఆపై తెల్ల మచ్చలతో ఉంటాయి. అనంతరం మరో నెల తర్వాత చీము రక్తం కారుతూ చర్మవ్యాధితో పాటు రకరకాల జబ్బులు కూడా ఉన్నాయి. ఇవి పిసీ పల్లి మండల కేంద్రంలో తరచుగా కనిపిస్తున్నాయి. వీటిని తాకిన చిన్న పిల్లలకు అలానే చర్మవ్యాధులు వచ్చి ఇబ్బంది పడుతున్నారు. మండల మొత్తం మీద చికెన్ స్టాల్ వద్ద, హెూటల్లో తిని పారేసిన విస్తరాకులు వద్ద ఇలాంటి కుక్కలు కనపడుతున్నాయి. ఈ కుక్కలకు కళ్లు కూడా కనిపించని పరిస్థితి ఉంది. ఈ విధంగా జబ్బు చేసిన కుక్కలు రెండు మూడు సంవత్సరాల పాటు తిరుగుతూ ఉంటాయి. ఇవి పిల్లలను తాకినప్పటికీ కరిసే పరిస్థితి లేదు. జబ్బుతో ఎక్కడో ఒకచోట మూలన పడుంటాయి. ఈ విధంగా కుక్కలు అంతు చిక్కని వింత రోగాలతో పిసిపల్లిలో దర్శనమిస్తున్నాయి. ఇవి ఇండ్ల ముందు పడుకొని ఉంటాయి. ఇవి పడుకున్న చోట పిల్లలు చేతులతో ఆడుకున్నప్పటికీ వారు కూడా ఇలానే రోగాలబారిన పడుతున్నారు. బట్టలకు తగిలినా వాటి వల్ల దురద వస్తోంది. ఈ వింత రోగాల పట్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా పిసిపల్లి ప్రభుత్వ వైద్యశాల సెంటర్లో ఈ కుక్కలు సుమారు 10 దాకా దర్శినమిస్తున్నాయి. వీటిని గురించి ఎవరూ పట్టించుకోవటం లేదు. అధికారులు ఈ జబ్బు పడ్డ కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డు ప్రమాదంలో టిప్పర్ కింద పడి మరణించిన వెంకటరావు

స్కూటర్‌ను ఢీకొన్న టిప్పర్

తండ్రి మృతి.. కుమార్తెకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని మద్దులూరు గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందగా ఆయన కుమార్తెకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో కొండపి మండలం కట్టావారి పాలెం గ్రామానికి చెందిన రావెళ్ల వెంకట్రావు(57) మృతి చెందగా ఆయన కుమార్తె శ్రావణికి తీవ్ర గాయాలయ్యాయి. వెంకట్రావు తన కుమార్తెతో కలిసి స్కూటీపై ఒంగోలు నుంచి తన స్వగ్రామం కట్టావారిపాలెం వెళుతున్నారు. ఈ క్రమంలో మద్దులూరు గ్రామ సమీపంలోని రొయ్యల ఫ్యాక్టరీ మున్నంగి సీ ఫుడ్స్ దగ్గర వారి స్కూటీని టిప్పర్ ఢీకొట్టడంతో వెంకట్రావు టిప్పర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన కుమార్తె శ్రావణికి తీవ్ర గాయాలయి కాలు నుజ్జు నుజ్జు అయింది. ఆమెను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. స్థానిక ఎస్ఐ దేవకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తీవ్రంగా గాయపడిన శ్రావణి



బావిలో పడి మృతి చెందిన మేడగం చంద్రశేఖర్‌రెడ్డి

బావిలో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి-దర్శి

తాళ్లూరు మండలం దారంవారిపాలెంలో మేడగం చంద్రశేఖర్‌రెడ్డి(21) బుధవారం దిగుడుబావిలో నీటి కోసం వెళ్లి కాలుజారి పడటంతో ఈత రాక మునిగిపోయి మృతి చెందాడు. తాళ్లూరు ఏఎస్ఐ మోహన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రశేఖర్‌రెడ్డి బిటెక్ 2వ సంవత్సరం చదువుతూ సెలవులలో ఇంటికి వచ్చి తాగునీటి కోసం దిగుడుబావిలో దిగగా కాలుజారి పడటంతో నీటిలో మునిగిపోయి మృతి చెందినట్లు తెలిపారు. తండ్రి బాలిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ తెలిపారు.

కొండపై మృతదేహం కలకలం

ప్రజాశక్తి-కంభం రూరల్

కంభం పట్టణం సమీపంలోని మస్తాన్ స్వామి దర్గా కొండపై బుధవారం మృతదేహం కలకలం రేపింది. మృతుడు బాపట్ల జిల్లా మార్టూరుకు చెందిన సురేష్‌గా పోలీసులు గుర్తించారు. సురేష్ కంభం రైల్వే స్టేషన్‌లో గ్యాంగ్ మెన్ గా విధులు నిర్వహిస్తున్నాడు. నెలరోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చిన సురేష్ అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు సురేష్ కోసం వెతికి పోలీసులను ఆశ్రయించారు. నెల రోజుల తర్వాత సురేష్ శవమై తేలాడు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న కార్మిక సంఘం నేతలు

ఉపాధి హామీ బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని జువ్వలపాలెం, కిష్కిందపాలెం, తిప్పలకట్ట, తోకలవానిపాలెం గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బొనిగల సుబ్బారావు పర్యటించారు. ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా వచ్చిన ప్రభుత్వాలు ఊకదంపుడు ఉపన్యాసాలు చెప్పడం తప్ప పేదల బతుకులు మారడం లేదని అన్నారు. కరువు పనిగా పిలవబడే ఉపాధి హామీ పథకం పనులు ఎన్నికల అనంతరం ఇప్పటివరకు జరగడం లేదని అన్నారు. గతంలో చేసిన పనికి 7వారాల డబ్బులు నేటికీ కూలీలకు అందలేదని అన్నారు. ఇప్పటివరకు ఉన్న కనీస సౌకర్యాలు రద్దుచేసి పనులకు రాకుండా చేసే ప్రయత్నాలు ప్రభుత్వాలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రతి కూలీకి ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని కోరారు. రూ.600 కనీస వేతనం ఇవ్వాలని కోరారు. అనేక పోరాటాలతో సాధించుకున్న ఉపాధి చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. గ్రూపులను రద్దు చేసి వర్క్ ఐడి ఆధారంగా మస్టర్లు వేస్తున్నారు. దీని ఫలితంగా పనిచేసిన వారికి చేయని వారికి ఒకే వేతనం వస్తుందని అన్నారు. వీటితో పాటు ఉపాధి హామీ కూలీలకు కనీస అవసరాలైన మంచి నీళ్లు, టెంట్లు, మెడికల్ కిట్లు, మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, పలుగు, పారకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరుతూ ఈ నెల 20న ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వేములపల్లి వెంకట రామయ్య, ఆయా గ్రామాల కూలీలు పాల్గొన్నారు.



పర్యటకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివకుమార్

తీరంలో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చీరాల

సముద్ర స్నానాలకు వచ్చే పర్యాటకులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అలల తాకిడికి గురికాకుండా నిర్ణయించిన ప్రదేశాల్లోనే సముద్ర స్నానాలు చేయాలని ఈపురిపాలెం ఎస్ఐ శివకుమార్ పర్యాటకులకు సూచించారు. సముద్ర తీర ప్రాంతంలో ఆయన బుధవారం పర్యటించారు. పర్యాటకులకు తీరంలో జరుగుతున్న ప్రమాదాలపై అవగాహన కల్పించారు. లోతులో మునగకుండా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. సముద్రంలో గుంతలు ఉన్నాయని, ఇటీవల అలల తాకిడికి తలెత్తిన వివిధ ఘటనలను వారికీ వివరించి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. పర్యటకులు పోలీసుల సూచనలు పాటింటి సహకరించాలని కోరారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

ప్రజాశక్తి - ఇంకొల్లు

మొహరం వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహిస్తున్నారు. వేడుకల ముగింపు సందర్భంగా సరికొత్త కోయ వేష ధారణలతో పీరులను వైభవంగా గ్రామంలో ఊరేగించారు.



పీర్లను ఊరేగిస్తున్న ముస్లింలు

ఈనాం భూములకు హక్కులు కల్పిస్తాం

మంత్రి గొట్టిపాటి రవికుమార్ హామీ

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలో గత కొన్నేళ్లుగా ఈనామ్ భూములు సాగు చేసుకుంటున్న వెయ్యి మంది రైతులకు ఆగస్టు 15లోపు భూ హక్కు కల్పిస్తామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. మండలంలోని పుట్టావారిపాలెం అడ్డ రోడ్డు సమీపంలోని రవికుమార్ అతిథి గృహంలో నాయకులు, కార్యకర్తలతో గ్రామాల వారీగా బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుక వస్తే పరిష్కారం చేస్తామని అన్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి భూ పంపిణీ చేస్తామని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి నెలరోజులైనా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒకదాని తరువాత ఒకటి పరిష్కారం చేసుకుంటూ పోతున్నామని అన్నారు. పెన్షన్లు రూ.3వేల నుండి రూ.4వేలకు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. గగ మూడు నెలల కాలంతో కలిపి లబ్ధిదారులకు పెన్షన్లు రూ.7వేలు అందజేసినట్లు తెలిపారు. ఆగిపోయిన 150 అన్నా క్యాంటీన్లను తిరిగి ఆగస్టు 15 నుండి ప్రారంభించి పేదలకు భోజన వసతి కల్పిస్తామని అన్నారు. రైతులకు వైసీపీ ప్రభుత్వం జారీచేసిన వివాదస్పద ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్టును మంత్రి మండలి సమావేశం రద్దు చేసిందని అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై ప్రజల్లో అనేక భయాందోళనలు నెలకొన్న సంగతి తెలిసిందేనని అన్నారు. భూమికి రిజిస్ట్రేషన్ పత్రాలు ఇవ్వకుండా జిరాక్సులు ఇస్తామనడం, సమస్యలు వస్తే హైకోర్టుకు వెళ్లి పరిష్కరించుకుండా ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పడం ద్వారా రైతులు భయభ్రాంతులకు గురైనారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యం ద్వారా ఎన్నుకున్న ప్రభుత్వం కాదాని రైతులు జగన్ ప్రభుత్వంపై విరుచుకు పడ్డారని అన్నారు. అలాంటి చట్టం నుండి విముక్తి కలుగ చేశామని అన్నారు. గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగిపోయారని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రజలకు న్యాయమైన పరిపాలన అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వై ఎలమంద, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు సన్నెబోయిన గురు యాదవ్, మాజీ ఎంపీపీ ఆట్లా చిన్న వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ సన్నెబోయిన ఏడుకొండలు, మాదాల సుబ్బారావు, తేలప్రోలు రమేష్, చేవూరి వాసురెడ్డి, ధూపాటి ఏసోబు, దిండు హనుమంతరావు, వెంకటరావు, అడ్డగడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మంత్రి గొట్టిపాటి

సింగల్ రోడ్డులో వాహనదారుల తిప్పలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

భట్టిప్రోలు నుండి రేపల్లె వెళ్లేందుకు ఏకైక ప్రధాన రహదారి సింగల్ రోడ్డు కావడంతో వర్షాల సమయంలో రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. భట్టిప్రోలు నుండి రేపల్లె వరకు 13కిలోమీటర్ల మేర ఈ రహదారి సింగల్ రోడ్డుగా ఉండటమే కాక ఇరు వైపులా పెద్ద, పెద్ద గుంటలు ఏర్పడి ఎదురు వచ్చే వాహనం తప్పుకోవటానికి గుంటలో జారిపోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఎన్నో ఏళ్లుగా ఈ రహదారి అభివృద్ధికి నోచుకోలేదు. ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ రహదారిని గత ఐదేళ్ల క్రితం 216ఎ జాతీయ రహదారిగా గుర్తించారు. దీంతో ఆనాడు భట్టిప్రోలు నుండి రేపల్లె, పెనుమూడి వరకు రహదారి విస్తరణ జరుగుతుందని ప్రజలంతా భావించారు. కానీ ఈ రహదారిలో ఏడు గ్రామాలు ఉండటమే కాక అనేక మలుపులతో కూడి ఉండడంతో జాతీయ రహదారి ఏర్పాటు కుదరదని భావించారు. దీంతో మరోమారు భట్టిప్రోలు నుండి పెనుమూడి వరకు పంట పొలంలో కూడా సర్వే నిర్వహించి జాతీయ రహదారి నిర్మాణాన్ని చేపట్టారు. దీని కారణంగా భట్టిప్రోలు – రేపల్లె మార్గం అభివృద్ధికి నోచుకోలేదు. సింగల్ రహదారిగానే మిగిలిపోయింది. నిత్యం రేపల్లె నుండి భట్టిప్రోలు మీదగా తెనాలి, విజయవాడ, గుంటూరు, చీరాల వైపుకు ఆర్టీసీ బస్సులు ప్రయాణిస్తూ ఉంటాయి. వీటితోపాటు నిత్యం ఆటోల్లో ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారు. ఉద్యోగులు, వ్యాపారులు నిరంతరం ఈ రహదారి గుండానే ప్రయాణించాల్సి ఉంది. అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ రహదారి అభివృద్ధి పట్ల పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.



భట్టిప్రోలు - రేపల్లె రోడ్డులో ఆర్టీసీ బస్సు, కారు

రహదారికి ఇరువైపుల గుంటలు

సింగల్ రహదారిగా ఉన్న రోడ్డుకు అక్కడక్కడ పెద్దపెద్ద గుంట గుంతలు ఏర్పడి ప్రయాణం ప్రాణ సంకటకంగా మారింది. ఓ ప్రక్క మార్జిన్లు సరిగా లేకపోగా మరోపక్క కోనేటిపురంలో ఈ రహదారి పూర్తిగా ధ్వంసమై పెద్ద పెద్ద గుంటలు ఏర్పడి వాహన చోదకులకు భయాందోళన కలిగిస్తుంది. ఆదమరిస్తే గుంటలో వాహనాలు జారీ పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. గ్రామంలోని గుంటలో ఈపాటికే అనేక మంది ద్విచక్ర వాహనదారులు, ఆటోలు జారి పడి ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయి. గత వైసిపి ప్రభుత్వం రహదారుల అభివృద్ధిలో తీవ్ర నిర్లక్ష్యం వహించిన దృష్ట్యా ప్రజలు విసుగు చెంది టిడిపి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారు. దీన దృష్ట్యా కూటమి పాలనలోనైనా రహదారుల అభివృద్ధికి మోక్షం కలుగుతుందని ప్రజల భావిస్తున్నారు. భట్టిప్రోలు నుండి రేపల్లె వరకు సింగిల్ రహదారిగా ఉన్న ఈ రోడ్డును డబల్ రోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరుచున్నారు.

పశు బీమా ఉచితంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - చీరాల

గొర్రెలు, మేకల పెంపంకం దారుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని, ఉచింతంగా జివాలకు భీమా పథకం అమలు చేయాలని గొర్రెలు, మేకల పెంపంకం దారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలారు పెద్దబ్బాయి కోరారు. పట్టణంలోని ప్రవేటు కళ్యాణ మండపంలో బుధవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. జివాల పెంపకం దారులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. జివాలకు మేత, వైద్య సమస్య అధికంగా ఉందని అన్నారు. వర్షాకాలంలో పిడుగుపాటుకు పెద్ద సంఖ్యలో జీవాల పెంపకం దారులు మృత్యువాత పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ సహకారం తగినంతగా లభించడం లేదని అన్నారు. బ్యాంకర్లు జీవాలు ఉన్నవారికి కాకుండా జీవాలు మేపని వారికి రూ.కోట్లలో రుణాలు ఇస్తున్నారని అన్నారు. నిజమైన పెంపకం దార్లకు మొండి చేయి చూపుతున్నారని అన్నారు. జిల్లాలో పెద్ద సంఖ్యలో ఉన్న పెంపకం దారులందరూ సంఘటితం కావాలని చెప్పారు. వివిధ గ్రామాల నుంచి హాజరైన పెంపకం దారులు వారి సమస్యలు వివరించారు. అనంతరం జూలై 31న గొర్రెలు, మేకల పెంపకం దారుల జిల్లా మహాసభను చీరాల్లో జరపాలని తీర్మానించారు. దీనికి పెద్ద సంఖ్యలో పెంపకం దారులందరినీ సమీకరించాలని తీర్మానించారు. పశు బీమా పథకాన్ని ఉచితంగా అమలు చేయాలని, గొర్రెకు రూ.8వేల చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని, షెడ్డు పథకాన్ని చిన్న జీవాలకు ఒకే రకంగా 90శాతం సబ్సిడీతో రూ.3లక్షలు ఇవ్వాలని కోరారు. రాజకీయ ప్రమేయం లేకుండా అందరికీ ఈ పథకాన్ని వర్తింప జేయాలని డిమాండు చేశారు. 2019లో టిడిపి ప్రభుత్వమే గోకులం స్కీం అందరికీ 90శాతం సబ్సిడీ వర్తింప చేసిందని గుర్తు చేశారు. సమావేశంలో ప్రకాశం జిల్లా కార్యదర్శి తోట తిరుపతయ్య, ప్రకాశం జిల్లా మాజీ అధ్యక్షులు బుర్రి ఆంజనేయులు, చీరాల నాయకులు వెంకటేశ్వర్లు, దబ్బకూటి యలమంద, గొర్ల శీను, మద్దిబోయిన శేషు, నాగరాజు, పర్చూరు నాయకులు గోపి, చేతి వృత్తుల సంఘం జిల్లా కన్వీనర్ పి కొండయ్య, ప్రజా సంఘాల నాయకులు సిహెచ్ గంగయ్య, ఎన్ బాబురావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిఎంపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దబ్బాయి

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పర్చూరు శాసన సభ్యులు ఏలూరి ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి, ప్రజల అవసరాలు తీర్చేందుకు సాగర్ జలాలు విడుదల అయ్యేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న చొరవ హర్షణియమని శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. పల్నాడు, ప్రకాశం, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఎన్ఎస్పి కుడి ప్రధాన కాలువ ద్వారా బుధవారం నీటిని విడుదల చేయడం ప్రజల పట్ల కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనంగా నిలుస్తుందని అన్నారు. ప్రజల అవసరాలు పరిష్కరించమని ప్రజా ప్రతినిధులు చేసిన విజ్ఞప్తి పట్ల ప్రభుత్వం స్పందన ఎనలేనిదని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సాగర్ నీటి ద్వారా చెరువులు యుద్ధ ప్రాతిపదికన నింపాలని అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ప్రణాళికబద్ధంగా మేజర్లకు నీటిని పంపిణీ చేసేలా పర్యవేక్షించాలని అన్నారు. చెరువులను నింపాలని సూచించారు. గత వైసిపి ప్రభుత్వం నీటి ఎద్దడి నివారణలో పూర్తిగా వైఫల్యం చెందిందని అన్నారు. నడి వేసవిలో చెరువులను నింపేందుకు దృష్టి సారించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. తాగునీటి విడుదలపై గత ప్రభుత్వం ప్రకటనలు తప్ప ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. ప్రజల అవసరాలను గుర్తించి వారికి సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు.



ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు

విద్యుత్ బిల్లు చెల్లింపుకు మార్గదర్శకాలు

ప్రజాశక్తి - బాపట్ల

ఆర్‌బిఐ మార్గదర్శకాలను అనుసరించి ఇక నుండి విద్యుత్ బిల్లులు చెల్లింపునకు నూతన విధానాన్ని అమలు చేస్తున్నట్లు విద్యుత్ ఎఈ పెరుగు శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ బిల్లు చెల్లింపునకు సంబంధించిన కరపత్రాలను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ బిల్లులను ఇక నుండి ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లించాలని అన్నారు. ఈ యాప్‌లో ఎపి సిపిడిసిఎల్ డిస్కమ్ పేరు కనిపించదని అన్నారు. అయితే ఎపి సిపిడిసిఎల్ కస్టమర్ యాప్ ప్లే స్టోర్ నుండి డౌన్ లోడ్ చేసుకొని దాని ద్వారా గాని, ఎపి సిపిడిఎల్ డిస్కమ్ వెబ్సైట్ https://apcpdcl.in/ ద్వారా బిల్లులు చెల్లించవచ్చన్నారు. డెబిట్, క్రిడిట్, నెట్ బ్యాంకింగ్, వాల్లెట్స్, క్యాష్ కార్డ్స్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు. సకాలంలో బిల్లులు చెల్లించి సహకరించాలని కోరారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎఇ శ్రీనివాసరావు

కార్పొరేషన్ కైవశం కోసం..

దామచర్ల వ్యూహం..!

- జనార్ధన్ వద్దకు క్యూ కడుతున్న వైసిపి కార్పొరేటర్లు, మహిళా కార్పొరేటర్ల భర్తలు
- బాలినేని ఒంగోలును వీడిన గంటల్లోనే జనార్ధన్‌ను కలిసిన డిప్యూటీ మేయర్ బుజ్జి
- ఆయన బాటలోనే మరికొంతమంది..
- ఎటూ తేలని మేయర్ గంగాడ వ్యవహారం
- ఎంపీ మాగుంటను మర్యాద పూర్వకంగా కలిసిన సుజాత

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఎన్నికల్లో విజయం సాధించిన తరువాత దామచర్ల జనార్ధన్ ఒంగోలు కార్పొరేషన్‌ను టిడిపి కైవశం చేసేందుకు పావులు కదుపుతున్నారు. అందుకు అనుగుణంగా ఆయన అడుగులు వేస్తున్నారు. టిడిపిలో చేరేందుకు పలువురు వైసిపి కార్పొరేటర్లు నేరుగా జనార్ధన్‌ను కలుస్తున్నారు. మరికొంతమంది టిడిపి ద్వితీయశ్రేణి నాయకులకు టచ్‌లో ఉన్నారని సమాచారం. తాజాగా డిపూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ (బుజ్జి) బుధవారం ఎమ్మెల్యే జనార్ధన్ నివాసానికి వెళ్లి ఆయన్ను కలిశారు. ఆయనతో బ్రేక్‌ఫాస్ట్ చేశారు. త్వరలోనే పార్టీలోకి వస్తామని దామచర్లకు బుజ్జి హామీ ఇచ్చినట్లు సమాచారం. బుజ్జితో పాటు రెండో డివిజన్ కార్పొరేటర్ తెల్లపల్లి ధనలక్ష్మి భర్త గాంధీ, 43వ డివిజన్ కార్పొరేటర్ భర్త కండె రమణా యాదవ్ ఉన్నారు. మంగళవారం రాత్రి 30వ డివిజన్ కార్పొరేటర్ కాశీమహంతి చంద్రకళ భర్త నాని జనార్ధన్ సమక్షంలో టిడిపిలో చేరారు. 24వ డివిజన్ కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ, 35వ డివిజన్ కార్పొరేటర్ ఆదిపూడి గిరిజా శంకర్ శాండిల్యా కూడా దామచర్లకు టచ్‌లో ఉన్నారని చర్చ జరుగుతోంది. మేయర్ గంగాడ సుజాత పార్టీ మారే విషయంలో ఎలాంటి నిర్ణయానికి రాలేకపోతున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. సోమవారం ఒంగోలు వచ్చిన బాలినేని శ్రీనివాసరెడ్డిని ఆమె కలిశారు. వైసిపి కార్పొరేటర్లతో జరిగిన సమావేశంలో కూడా ఆమె పాల్గొన్నారు. రాజకీయంగా బాలినేని శ్రీనివాసరెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే విషయం మీద స్పష్టత లేకపోవడంతో మేయర్ ఆచీతూచీ అడుగులు వేస్తున్నారనే చర్చ జరుగుతోంది.


జనార్ధన్ సమక్షంలో టిడిపిలో చేరుతున్న 30వ డివిజన్ కార్పొరేటర్ చంద్రకళ భర్త నాని


ఎంపీ మాగుంటను మర్యాద పూర్వకంగా కలిసిన మేయర్ గంగాడసుజాత

బాలినేని చెప్పిన గంటల వ్యవధిలోనే..

'వైసిపి కార్పొరేటర్లు పార్టీ మారుతారని నేను అనుకోవడం లేదు. ఎవరైనా పార్టీ మారితే నేను కాపలా ఉండలేను. అది వారి ఇష్టం. కార్పొరేటర్లకు రెండేళ్ల పదవీ కాలం ఉంది. రెండేళ్ల పదవిని అనుభవించడానికి వారి రాజకీయ భవిష్యత్తును నాశనం చేసుకుంటారని నేను అనుకోవడం లేదు' అని మంగళవారం పాత్రికేయుల సమావేశంలో బాలినేని శ్రీనివాసరెడ్డి కార్పొరేటర్ల వ్యవహారం మీద వ్యాఖ్యానించారు. మంగళవారం రాత్రికి ఆయన ఒంగోలును వీడి వెళ్లిపోయారు. బాలినేని ఒంగోలును వీడిన గంటల వ్యవధిలోనే డిప్యూటీ మేయర్ బుజ్జి దామచర్లను కలవడం, పలు విషయాల మీద చర్చించడం గమనార్హం. మరికొద్ది రోజుల్లో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ కుటుంబ సభ్యులతో కలిసి విదేశాలకు వెళుతున్నారని సమాచారం. వచ్చే నెల పది తరువాత ఆయన ఒంగోలుకు తిరిగి వస్తారని తెలిసింది. అప్పటికి మరికొంతమంది వైసిపి కార్పొరేటర్లు, వారి భర్తలు వైసిపిని వీడి టిడిపిలో చేరుతారనే చర్చ జోరుగా కొనసాగుతోంది.

కౌన్సిల్ సమావేశం వాయిదాలో మతలబు అదేనా..?

కార్పొరేషన్ జనరల్ సమావేశం మొదట ఈ నెల 18న జరగాల్సి ఉంది. ఇందుకు సంబంధించి కార్పొరేటర్లదంరికీ అజెండాను కూడా పంపారు. అయితే పరిపాలన సౌలభ్యం దృష్ట్యా కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు మేయర్ మంగళవారం రాత్రి నోటీసు ఇచ్చారు. ఈ మేరకు మీడియాకు సమాచారం పంపారు. కౌన్సిల్ సాధారణ సమావేశం ప్రతి మూడు మాసాలకోసారి జరగాల్సి ఉంది. సాధారణ ఎన్నికల నేపథ్యంలో గత మూడు మాసాలకు పైగా కౌన్సిల్ సమావేశం నిర్వహించలేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 16న కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని మొదట నిర్ణయించారు. దాన్ని 18కి మార్పు చేశారు. ఇప్పుడు అకస్మాత్తుగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలోనే కౌన్సిల్ సమావేశం వాయిదా వేసినట్లు మేయర్ చర్యలను బట్టి అర్థమవుతోందని పలువురు కార్పొరేటర్లు చర్చించుకుంటున్నారు.

వైసిపి చేజారుతున్న మెజారిటీ.!

సుమారు మూడేళ్ల కిందట జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో ఒంగోలు నగరంలో 50 డివిజన్‌లకు గాను వైసిపి 41 డివిజన్‌లలో, టిడిపి ఆరు డివిజన్‌లు, జనసేన కార్పొరేటర్ ఒక డివిజన్‌లో విజయం సాధించారు. రెండు చోట్ల ఇండిపెండెంట్లు గెలిచారు. తరువాత వారు వైసిపిలో చేరారు. దీంతో వైసిపి బలం 43కు చేరింది. వారు కార్పొరేషన్ చేజిక్కించుకొని వైసిపి నుంచి మేయర్‌గా గంగాడ సుజాతను ఎన్నుకున్నారు. ఇప్పుడు మూడేళ్ల తరువాత రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు మారాయి. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఒంగోలులోనూ ఎమ్మెల్యేగా తెలుగుదేశం పార్టీ నుంచి దామచర్ల జనార్ధన్ గెలుపొందారు. గత సాధారణ ఎన్నికలకు ముందు సుమారు ఐదు మంది కార్పొరేటర్లు టిడిపిని వీడి వైసిపిలో చేరారు. దీంతో తెలుగుదేశం కార్పొరేటర్ల బలం కౌన్సిల్‌లో 11కు చేరింది. జనసేనతో కలిపి 12 మంది అయ్యారు. ఎన్నికల ఫలితాల తరువాత ఇప్పుడు 40వ డివిజన్ కార్పొరేటర్ తేళ్ల చంద్రశేఖర్ ఇటీవల వైసిపిని వీడి జనార్ధన్ సమక్షంలో టిడిపిలో చేరారు. తాజాగా మంగళవారం రాత్రి 30వ డివిజన్ కార్పొరేటర్ చంద్రకళ భర్త నాని టిడిపిలో చేరారు. ఆయన భార్య కూడా టిడిపిలో చేరనున్నట్లు ప్రకటించారు. దీంతో అధికారికంగా టిడిపి బలం 14కు వెళ్లింది. బుధవారం డిప్యూటీ మేయర్ బుజ్జి, ఇద్దరు కార్పొరేటర్ల భర్తలు కూడా జనార్ధన్ కలిసి మద్దతు ఇచ్చి వచ్చారు. త్వరలోనే టిడిపిలో చేరుతామని జనార్ధన్‌కు హామీ ఇచ్చారని ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే డిప్యూటి మేయర్ వేమూరి బుజ్జి త్వరలోనే టిడిపిలో చేరడం ఖాయం. ఆయనతో పాటు మరికొంతమంది వైసిపిని వీడే అవకాశం ఉంది. దీంతో టిడిపి కార్పొరేటర్ల బలం సుమారు 20కు వెళుతోందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

26 మంది ఉంటే టిడిపిదే పీఠం..

50 మంది కార్పొరేటర్లు ఉన్న నగరపాలక సంస్థ పాలకవర్గంలో 26 మంది మద్దతు ఉన్నవారు రూలింగ్‌లోకి వస్తారు. ఇప్పుడున్న మేయర్‌ను మార్పు చేసి కొత్త మేయర్‌ను ఎన్నుకోవచ్చు. రిజర్వేషన్ దృష్ట్యా ఒంగోలు మేయర్ స్థానం ఎస్సీ మహిళకు రిజర్వు అయ్యింది. తెలుగుదేశం పార్టీ నుంచి ఎస్సీ మహిళా కార్పొరేటర్‌ను మేయర్ చేసే అవకాశం ఉంది. కార్పొరేషన్ పీఠం దక్కించుకునేందుకు మరికొద్దిమంది కార్పొరేటర్ల సపోర్టు టిడిపికి అవసరం కావడంతో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ అందుకు అనుగునంగా రాజకీయ వ్యూహం ప్రదర్శిస్తున్నారని సమాచారం. జనార్ధన్ విదేశీ పర్యటన ముగించుకొని వచ్చే నెలలో ఒంగోలు వచ్చేనాటికి వైసిపి చేతిలో ఉన్న ఒంగోలు నగరపాలక సంస్థ పరిపాలన టిడిపి చేతికి రావడానికి మార్గం సుగమం అవుతోందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కౌన్సిల్ సమావేశం కూడా అప్పుడే ఉంటుందనే చర్చ కార్పొరేషన్ వర్గాల్లో జరుగుతోంది.

ఎంపీని కలిసిన మేయర్..

మేయర్ గంగాడ సుజాత బుధవారం ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డి గెలిచిన తరువాత మేయర్ గంగాడ సుజాత ఆయన్ను మొదటిసారి కలిశారు. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య ఒంగోలు కార్పొరేషన్‌లో నెలకొన్న తాజా రాజకీయాలు ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం.

అధ్వానంగా 'జగనన్న కాలనీ'లు

- కాలనీల్లో పూర్తికాని రహదారులు
- వర్షాలకు చిత్తడిగా మారిన వైనం
- గృహ నిర్మాణదారుల అవస్థలు
- కొత్త ప్రభుత్వంపై ఆశలతో లబ్ధిదారులు


కాలనీల్లో చిత్తడిగా మారిన రోడ్డు

ప్రజాశక్తి-మార్కాపురం

గత ప్రభుత్వంలో మంజూరైన జగనన్న కాలనీలు అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా మారాయి. కాలనీలు మంజూరు చేసి కనీస వసతులు కల్పించడంలో నిర్లక్ష్యంతో లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఈ కాలనీల అభివృద్ధి గురించి పట్టించుకుంటుందేమోనని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల పేరిట మార్కాపురం మున్సిపాలిటీలో 6029 మంది లబ్ధిదారులకు నివేశన స్థలాలతో పాటు పక్కా గృహాలను మంజూరు చేసింది. మార్కాపురం మున్సిపాలిటీలో వేలల్లో లబ్ధిదారులు ఉన్నందున పట్టణ సమీపంలో స్థలం అందుబాటులో లేకపోవడంతో పట్టణానికి ఆరు కిలోమీటర్ల దూరంలో స్థలాలు కేటాయించారు.

జగనన్న కాలనీలకు కేటాయించిన ప్రదేశాల్లో విద్యుత్, నీటి వసతి కల్పించడంతో కొందరు గృహాలు నిర్మించుకునేందుకు ఆసక్తి కనబరిచారు. మార్కాపురం పట్టణ పరిధిలోని నాగుల వరం రోడ్డులో కేటాయించిన లబ్ధిదారుల్లో అత్యధిక మంది గృహాలు నిర్మించుకున్నారు. కాలనీల్లో రహదారులు నిర్మించడంతో పాటు మురుగు కాలువల నిర్మాణం కూడా చేపట్టాల్సి ఉంది.

మార్కాపురం మున్సిపాలిటీలోని జగనన్న కాలనీలో రహదారులు దారుణంగా ఉన్నాయి. కొందరు గృహాలు నిర్మించుకున్నా అందులో గృహ ప్రవేశాలకు అనువుగా లేదు. వర్షపు నీరు ఎక్కడంటే అక్కడ నిలిచిపోయింది. మురుగు కాలువలు లేవు. రహదారులు అసలే లేవు. ప్రస్తుతం కొన్ని గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయి. రహదారులు సక్రమంగా లేని కారణంగా అక్కడకు భవన నిర్మాణ మెటీరియల్ చేర్చుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. ప్రధానంగా రహదారుల సమస్య ఉంది. ఆ తరువాత మురుగు కాలువలు ఏర్పాటు చేస్తే అక్కడ చేరిన మురుగు బయటకు వెళ్లే అవకాశం ఉంది. గత ప్రభుత్వంలో రహదారుల నిర్మాణం అక్కడక్కడా మొదలు పెట్టారు. ఇంతలో ఎన్నికల సమీపించడంతో జగనన్న కాలనీల్లో జరగాల్సిన అభివృద్ధి పనులు తాత్కాలింగా నిలిచిపోయాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసిపి అధికారాన్ని కోల్పోవడంతో జగనన్న కాలనీల్లో సమస్య ప్రస్తుత టిడిపి ప్రభుత్వం పట్టించుకుంటుందో లేదోననే అనుమానంతో లబ్ధిదారులు ఉన్నారు. కొత్త ప్రభుత్వం వీలైనంత త్వరగా చర్యలు తీసుకొని కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.

పెట్టుబడిదారుల దోపిడీ పెరుగుతోంది

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-పొదిలి

పెట్టుబడిదారుల దోపిడీ రోజురోజుకూ పెరుగుతోందని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం పట్టణంలోని కాటూరివారిపాలెంలోని కళ్యాణ మండపంలో జరిగిన సిఐటియు ప్రకాశం జిల్లా నాయకత్వ శిక్షణా తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా సిఐటియు జెండాను రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం "వర్తమాన పరిస్థితుల్లో మన కర్తవ్యం" అంశం మీద ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారుల దోపిడీకి వ్యతిరేకంగా అనేక దేశాల్లో కార్మిక వర్గం ప్రతిఘటన పెరిగిందన్నారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ఉపయోగపడే తన పాత విధానాలనే వేగంగా అమలు చేయడానికి పూనుకుంటుందన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ అమలు, రవాణా రంగంలో కార్మికులకు నష్టం చేసేటటువంటి మూడు క్రిమినల్ న్యాయ చట్టాలను తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని వీటికి వ్యతిరేకంగా కార్మిక వర్గం, రైతాంగం ఐక్యమై పోరాటాలు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్మిక సమస్యలపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. శిక్షణ తరగతులు ప్రిన్సిపాల్‌గా సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు వ్యవహరించగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్, జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి వివిధ రంగాల నాయకులు పాల్గొన్నారు. జిల్లా నలుమూలలనుండి సిఐటియు రంగాల నాయకులు శిక్షణా తరగతులలో పాల్గొన్నారు.

మార్గ'దర్శి'గా తీర్చిదిద్దుతా: గొట్టిపాటి లక్ష్మి

ప్రజాశక్తి-దర్శి

దర్శి నియోజకవర్గాన్ని అన్ని విధాలా తీర్చిదిద్ది మార్గ'దర్శి'గా మారుస్తానని టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక అద్దంకి రోడ్‌లో 19 వార్డులో రూ.80 లక్షలతో సిమెంటు రోడ్డుకు దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్యతో కలిసి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి శంకుస్థాపన చేశారు. అంతకుముందు తహశీల్దారు కార్యాలయం ఆవరణలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏకలవ్యుని జయంతి వేడుకలో ముఖ్యఅతిథిగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ప్రసంగించారు. కురిచేడు రోడ్డులో శేషం చిన్న రమణయ్య ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన చాయ్ క్లబ్‌ను ఆమె ప్రారంభించారు. అదేవిధంగా స్థానిక రామాలయం గుడి వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజల నాడి తెలిసిన నాయకులుగా పనిచేస్తున్నారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ముందుకు సాగుతూ ప్రభుత్వానికి, ప్రజలకు జవాబుదారీతనంగా పని చేస్తున్నారని అన్నారు. అభివృద్ధిలో భాగంగా హామీ ఇచ్చిన మేరకు పెన్షన్లు రూ.4 వేలకు పెంచి ఇచ్చారని, ఉచిత ఇసుక పాలసీని తీసుకొచ్చారని, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశారని అన్నారు. దర్శికి ఇచ్చిన మొదటి హామీ డ్రైవింగ్ స్కూలుకు రూ.18.5 కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. అంచెలంచెలుగా దర్శిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమాలలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, 19వ వార్డు కౌన్సిలర్ దారం నాగవేణి, సుబ్బారావు, 2వ వార్డ్ కౌన్సిలర్ విసి రెడ్డి, దర్శి నగర పంచాయతీ కమిషనర్ వై మహేశ్వరరావు, వైస్ చైర్మన్‌లు జి స్టీవెన్, కోటయ్య, పట్టణ నాయకులు సంఘ తిరుపతిరావు, ప్రజా సంఘాల నాయకులు ఇ ప్రేమ్‌కుమార్, ఏ వెంకటేశ్వర్లు, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.


ఏకలవ్యుని జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

సాగర్ జలాలు విడుదల: ఇఇ

ప్రజాశక్తి-దర్శి

తాగునీటి అవసరాల కోసం సాగర్ జలాలను బుధవారం విడుదల చేసినట్లు దర్శి ఇఇ బి పూర్ణచంద్, డిఇ అక్బర్ బాషా తెలిపారు. దర్శి పరిధిలో 9 ఆర్‌డబ్ల్యూఎస్ ట్యాంకులు, కనిగిరి, మార్కాపురం ట్యాంకులకు నీరు నింపేందుకు సాగర్ నుంచి 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు వారు తెలిపారు. మొదట్లో 2,000 క్యూసెక్కులు.. తర్వాత పెంచుతూ పోతున్నట్లు తెలిపారు. ఈ నీటిని కుడికాలువ పరిధిలో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలకు తాగునీరు అందించేందుకు నీటిని విడుదల చేసినట్లు వారు పేర్కొన్నారు. దరిశి, కనిగిరి, యర్రగొండపాలెం, పుల్లలచెరువు, కురిచేడు, దూపాడు, త్రిపురాంతకం, లక్ష్మీపురం, రామతీర్థం జలాశయాలకు తాగునీటిని నింపేందుకు నీటిని విడుదల చేసినట్లు వారు తెలిపారు. రెండు రోజుల్లో దర్శికి వస్తాయని, తాగునీటి అవసరాలు తీర్చేందుకు 4.5 టిఎంసిల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. తాగునీటి అవసరాల కోసం చెరువులు నింపేందుకు ప్రణాళికలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

ప్రశాంతంగా పండగలు చేసుకోవాలి: డిఎస్‌పి

ప్రజాశక్తి-కనిగిరి

హిందూ ముస్లిములు సోదర భావంతో మెలిగి ఐక్యతగా పండగలు జరుపుకోవాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పండగలు జరుపుకోవాలని డిఎస్పి ఆర్ రామరాజు అన్నారు. బుధవారం సాయంత్రం కనిగిరి పోలీస్ స్టేషన్‌లో హిందూ ముస్లింలకు శాంతి కమిటీ ముఖ్యులతో సమావేశం నిర్వహించారు. మొహరం పండగలో ఉదయం జరిగిన ఉద్రిక్త పరిస్థితులను వివరించారు. ముస్లిం, ఆర్యవైశ్య సోదరులు సమన్వయం పాటించాలని అన్నారు. పండుగలు రాగద్వేషాలకు అతీతంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించాలని కోరారు. పండగ సందర్భంగా కొంతమంది ఆకతాయిలు తాగి గొడవలు చేస్తే వారికి కమిటీ సభ్యులు కౌన్సెలింగ్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం డిఎస్‌పి బాలసుందరరావు, దర్శి డిఎస్పి అశోక వర్ధన్‌రెడ్డి, దర్శి సీఐ సమీవుల్లా, మార్కాపురం సిఐ వెంకటేశ్వర్లు, కనిగిరి దాసరి వెంకటేశ్వరరావు, ఎస్ఐ త్యాగరాజు, హనుమంతునిపాడు ఎస్ఐ శివ నాగరాజు, పీసీపల్లి ఎస్ఐ రమేష్ బాబు, పీర్ల చావిడి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిఎస్‌పి

స్వచ్ఛ భారత్ కో-ఆర్డినేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-వెలిగండ్ల

స్వచ్ఛభారత్ మండల కో-ఆర్డినేటర్లుగా విధులు నిర్వహిస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని జిల్లా స్వచ్ఛభారత్ యూనియన్ నాయకుడు కోటేశ్వరరావు అన్నారు. రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌ను మంగళవారం తాడేపల్లి ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్లు కలిశారు. ఉద్యోగ భద్రత, జీతాల పెంపు తదితర సమస్యలపై యూనియన్ నాయకులు వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా నారా లోకేష్ వారి సమస్యలపై సానుకూలంగా స్పందించారని, త్వరలోనే మీ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు యూనియన్ నాయకుడు కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. వినతిపత్రం సమర్పించిన వారిలో స్వచ్ఛభారత్ మండల కో-ఆర్డినేటర్లు శాస్త్రి, షేక్ ఫక్రుద్దీన్ తదితరులు ఉన్నారు.


లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్వచ్ఛభారత్ జిల్లా యూనియన్ నాయకులు

నడిరోడ్డుపై విద్యుత్ స్తంభాలు

ప్రజలకు ఇబ్బందిగా మారిన వైనం

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

నడిరోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాల కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్న సంఘటన మండలంలోని పిల్లిపల్లి ఎస్సీ కాలనీలో చోటు చేసుకుంది. పిల్లిపల్లి ఎస్సీ కాలనీలో ప్రధాన రోడ్డుపై ఓ రెండు విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. గత టిడిపి ప్రభుత్వంలో ఈ రోడ్డును సిమెంటు రోడ్డుగా మలిచారు. అయితే సిమెంట్ రోడ్డు వేస్తున్న సమయంలో కూడా ఈ విద్యుత్ స్తంభాలను ఒక పక్కకు మార్చాలన్న ఆలోచన చేయకుండా అలాగే సిమెంట్ రోడ్డు వేశారు. ప్రస్తుతం ఈ రెండు స్తంభాలు నడిరోడ్డుపై ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్నాయి. ఒక విద్యుత్ స్తంభం డ్రైనేజీ కాలువలోనే ఉండడంతో మురుగు నీరు డ్రైనేజీ కాలువ ద్వారా వెళ్లే అవకాశం కూడా లేకుండా పోయింది. ఈ రోడ్డుపై నాలుగు చక్రాల వాహనం వెళ్లే అవకాశం కూడా లేకపోవడంతో ఆ వీధిలోని ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రం ఆ వీధిలోనే ఉండడంతో పౌష్టిక ఆహారం సరఫరా చేసేందుకు కూడా నిర్వాహకులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నడిరోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలను పక్కకు మార్చి ఇబ్బందులు తొలగించాలని ఎస్సీ కాలనీవాసులు కోరుతున్నారు.



నడిరోడ్డుపై డ్రైనేజీ కాలువలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభం, పిల్లిపల్లి ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం వద్ద నడిరోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభం


పొదిలి డిపోలో దీక్షలో పాల్గొన్న కార్మికులు

మూడో రోజు రిలే దీక్షలు

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి డిపోలో యాజమాన్యం చేస్తున్న కార్మిక వ్యతిరేక చర్యలకు నిరసనగా ఎంప్లాయీస్ యూనియన్ డిపో సెక్రటరీ పి ఓబులేసు ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు మూడవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా దీక్షలకు కూర్చున్న డ్రైవర్లు డిఎం దాసు, పి భీమయ్యలకు మాజీ సిసిఎస్ డెలిగేట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కొండలు, సీనియర్ కండక్టర్ బి సాంబశివరావులు దండ వేసి నిరాహార దీక్ష ప్రారంభించారు. సమస్యలు పరిష్కరించేంత వరకు ఈ రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో డ్రైవర్లు, కండక్టర్లు, కార్మికులు పాల్గొన్నారు.


బిఎన్ విజయకుమార్‌తో ఎంపిపి విజయ

ఎమ్మెల్యే బిఎన్‌ను కలిసిన ఎంపీపీ విజయ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌ను సంతనూతలపాడు ఎంపీపీ బుడంగుంట విజయ, ఆమె భర్త బుడంగుంట నాగేశ్వరరావు బుధవారం ఒంగోలులోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి తోడ్పాటు అందించి, మౌలిక వసతులకు కల్పనకు కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు.

ఎస్‌పిని కలిసిన టీడీపీ నాయకులు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆర్ దామోదర్‌ను టిడిపి రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు, సంతనూతలపాడు మండల టిడిపి అధ్యక్షులు మద్దినేని హరిబాబు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


ఎస్‌పికి టిడిపి నాయకుల శుభాకాంక్షలు

వీధి లైట్ల ఏర్పాటు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-కొనకనమిట్ల

'అంధకారంలో కొనకనమిట్ల ఎస్సీ కాలనీలు' అనే వార్త మంగళవారం ప్రజాశక్తిలో ప్రచురితమైంది. ఈ వార్తకు కొనకనమిట్ల పంచాయతీ కార్యదర్శి కె రాజకుమారి స్పందించారు. బుధవారం యుద్ధప్రాతిపదికన ఎస్సీ కాలనీల్లో విద్యుత్ మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యదర్శి రాజకుమారి మాట్లాడుతూ ఎస్సీ కాలనీలలో మరమ్మతు పనులు చేపట్టామని, రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్ధరిస్తామని ఆమె తెలిపారు.


వీధిలైట్లు వేస్తున్న దృశ్యం


రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

రెస్టారెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్టలోని భారత్ పెట్రోల్ బంక్ దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌పీ గార్డెన్ రెస్టారెంట్‌ను సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రెస్టారెంట్ నిర్వాహకులు ఎమ్మెల్యే బీఎన్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన సమన్వయకర్త కందుకూరి వెంకటేశ్వరరావు (బాబు), రాష్ట్ర టీడీపీ సెక్రటరీ ఆడక స్వాములు, రాష్ట్ర జనసేన అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, నాయకులు కరిచేటి శ్రీనివాసరావు, వాశేపల్లి వెంకటేశ్వరరెడ్డి, వివరం గోవిందయ్య, ఈదర విష్ణు, తన్నీరు వెంకటరావు, కందుకూరి ఆంజనేయులు, మోహన్, తేళ్ల చిన్న, తాతినేని రాము, పల్లపు శివ, యాసిన్, పత్తిపాటి శ్రీనివాసరావు, వాసు, పేర్నమిట్ట పవన్, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతుకు 'ధరా'ఘాతం

అకస్మాత్తుగా పడిపోయిన ధరలు

ఆందోళనలో మిర్చి రైతులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

గత ఏడాది మిర్చి మంచి ధర పలకడంతో ఈ ఏడాది కూడా రైతులు ఉత్సాహంగా మిర్చి సాగు చేపట్టారు. పంట దిగుబడి కూడా బాగా రావడంతో రైతులు సంతోషపడ్డారు. పండించిన పంటను తీసుకొని గుంటూరు మార్కెట్‌కి వెళ్లారు. ఈ సీజన్ ప్రారంభంలో క్వింటా రూ.23 వేలు ఉన్న ధర తీరా అక్కడకు వెళ్లేసరికి రూ.19 వేలు పలకడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. రైతులు పంటను వెనక్కి తీసుకొస్తే రవాణా చార్జీలు కూడా దండగని భావించి కొందరు రైతులు అదే ధరకు అమ్ముకున్నారు. కొనుగోలు సమయంలో వ్యాపారులు అనేక అభ్యంతరాలు పెడుతున్నారు. సుదూర ప్రాంతం నుంచి వచ్చారు.. ఎలాగైన పంటను అమ్ముకుంటారనే ఉద్ధేశ్యంతో ధరను ఇష్టం వచ్చినట్లు తగ్గిస్తున్నట్లు వాపోతున్నారు. పది క్వింటాళ్ల మిరప కాయలు కోస్తే అందులో ఆరు క్వింటాళ్ల తాలు (తెల్లకాయలు) వచ్చినట్లు రైతులు తెలిపారు. వాటిని రూ.6 వేలకు మించి కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర వస్తుందని ఆశ పడి రైతులు పండించిన మిర్చిని గత్యంతరం లేక శీతల గిడ్డంగుల్లో భద్ర పరుచుకున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ధర పెరుగుతుందని ఆశ పడ్డారు. అప్పుడు పంటను అమ్ముకోవచ్చునని అనుకున్నారు. అయితే ప్రభుత్వం మారినా మిర్చి ధర పెరగలేదు. ఇంకా రూ. ఐదు నుంచి రూ. ఆరు వేలు దాకా ధర తగ్గింది.

పడిపోయిన మిర్చి ధరలు..

ప్రస్తుతం తేజా రకం మిర్చి రూ. 15 వేలు నుంచి రూ. 18 వేల లోపు కొనుగోలు చేస్తున్నారు. ఎక్కువగా రూ. 15 వేలే అంటడగుతున్నారు. అలాగే ఆర్మూర్ రకం రూ. 11 వేల నుంచి రూ. 13,500, సింజెంటా బాడిగి రం రూ. 10 వేలు నుంచి రూ. 13 వేలు, 334 రకం రూ. 13 వేలు నుంచి రూ. 15 వేలు, సీడ్ రకాలు రూ. 10 వేలు నుంచి రూ. 15 వేలు వరకు మాత్రమే ధరలు పలుకుతున్నాయి. దీంతో శీతల గిడ్డం గుల్లోనే ఉంచాలా, వచ్చిన ధరకే అమ్ముకో వాలా అనేది అర్థం కాక రైతులు అయోమ యంలో పడుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో పంటలు సాగు చేసేందుకు పెట్టుబడులకు డబ్బులు లేక అవస్థలు పడుతున్నారు.



తెల్లకాయలు ఏరుతున్న కూలీలు



మిరప కాయలను లారీల్లో లోడ్ చేస్తున్న రైతులు

నియోజకవర్గంలో ఈ ఏడాది మిరప సాగు ఇలా..

మండలం	విస్తీర్ణం (ఎకరాల్లో)
యర్రగొండపాలెం	6,952
పుల్లలచెరువు	6,820
త్రిపురాంతకం	5,792
దోర్నాల	5,625
పెద్దారవీడు	5,315

శీతల గిడ్డంగుల్లో దాచుకోక తప్పదు



మూడు ఎకరాల్లో మిర్చిని సాగు చేశా. పంట ధర పతనం కావడంతో మిరపకాయలను ప్రస్తుతం ఉన్న ధరకు అమ్ముకుంటే పెట్టుబడులు కూడా రావు. అందుకే సరుకును గుంటూరులోని శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకున్నాను. ఇంతటి నష్టాలను గతంలో ఎన్నడూ చూడలేదు.

- దుగ్గినేని శివయ్య, మిర్చి రైతు, వాదంపల్లి

ఆశలు అడియాశలయ్యాయి



మిరప ధర రూ.15 వేలకు పడిపోవడంతో మాటలు రావడం లేదు. ఈ ఏడాది అప్పులన్నీ తీరుతాయనుకున్నాం. పంట చేతికొచ్చే సరికి ధర పడిపోయింది. ధర బాగుందని పెట్టుబడులు ఎక్కువగా పెట్టాం. ఈ ఏడాది పెట్టుబడి ఖర్చులు పెరిగాయి.

- బోయలపల్లి దాసు, ఒడ్డుపాలెం

విద్యార్థులకు బస్‌పాసులు అందజేత

ప్రజాశక్తి -రాచర్ల

రాచర్లకు చెందిన సామాజిక సేవాకార్యకర్త, ఏపీఎస్‌ఆర్‌టీసీ కండక్టర్ ఉలాపు శివశంకర్ నాయుడు రూ.12 వేలు తనసొంత నిధులు వెచ్చించి గిద్దలూరు, తురిమెళ్ల, కంభం కళాశాలల్లో చదివే పవన్, సాకేత్, దీన కుమారి, యాకోబ్, రాణి, సుజాత అనే ఆరు మంది వివిధ గ్రామాల విద్యార్థులకు బస్సు పాసులు అందజేశారు. నిరుపేద విద్యార్థులకు ఏదోరకంగా తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తానని విద్యార్థులు బాగా చదివి ప్రయోజకులు కావాలనేది తన ఆకాంక్ష అని శివ శంకర్ ఈ సందర్భంగా తెలియజేశారు.



ఎమ్మెల్యే కందులను పరామర్శిస్తున్న ఎంపి మాగుంట

ఎమ్మెల్యే 'కందుల'కు ఎంపీ మాగుంట పరామర్శ

ప్రజాశక్తి-మార్కాపురం

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి బుధవారం పరామర్శించారు. ఇటీవల హైదరాబాద్‌లోని యశోద హస్పటల్‌లో శస్త్ర చికిత్స చేయించుకొని ప్రస్తుతం మార్కాపురంలోని ఆయన నివాస గృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఆయన ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని, ప్రజా సేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.

నేటి నుండి పాలంక తిరునాళ్ల

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని దట్టమైన నల్ల మల అటవీ ప్రాంతంలో పాలుట్ల గిరిజన గూడెం సమీపంలో ఉన్న పాలంక వీరభద్రస్వామి తిరునాళ్ల బుధవారం ఘనంగా ప్రారంభ ˘మైంది. ఈనెల 20 వరకు అంగరంగ వైభవంగా వేడుకలు జరుగనున్నాయి. నల్లమల అడ విలో కృష్ణానది ఒడ్డున వెలసిన పుణ్యక్షేత్రం కావడంతో చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచే కాకుండా తెలంగాణ, పల్నాడు జిల్లాల సైతం భక్తులు తరలి వస్తున్నారు. యర్రగొండపాలెం నుంచి ప్రత్యేక కమాండర్లు, ట్రాక్టర్లు, మోటారు సైకిళ్లపై భక్తులు తరలివెళ్లారు. తిరునాళ్లకు ఈ మూడు రోజుల్లో సుమారు 30 వేల మంది భక్తులు రానున్నట్లు సమాచారం. దేవాలయంలో చెంచులు పూజారులుగా వ్యవహరిస్తారు. భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. అటవీ శాఖాధికారులు అటు అటవీ జంతువులకు ప్రమాదం వాటిల్లకుండా, ఇటు భక్తులకు ఎలాంటి హాని జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. పాలుట్ల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ పి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి భక్తులకు వైద్యసేవలు అందజేస్తున్నారు.

శ్రీ మార్కండేశ్వరస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రాజీనామా

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలోని శ్రీమార్కెండేశ్వరస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ వాలిచెర్ల కేశవరావు బుధవారం రాజీనామా చేశారు. వైసిపి అధికారం కోల్పోవడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఘనంగా పీర్ల పండుగ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండల పరిధిలోని వీరభద్రాపురం, కొలుకుల, మురారిపల్లి, బోయలపల్లి, గురిజేపల్లి తదితర గ్రామాల్లో బుధవారం తెల్లవారుజామున పీర్ల పండుగ పెద్ద షరగత్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పీర్ల చావిడ్ల వద్ద పీర్లు పట్టుకొని నిప్పుల గుండంలో నడిచి పలువురు తమ భక్తిని చాటుకున్నారు. ముందుగా ఆయా గ్రామాలలో పీర్లను ఊరేగించారు. మహిళలు పీర్లకు నీళ్లపోసి మొక్కులు తీర్చుకున్నారు.



పులి అడుగు జాడలు పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

చిరుతపులి జాడలు గుర్తింపు

ప్రజాశక్తి- రాచర్ల

రాచర్ల మండలం ఫారం గ్రామ పరిసర పొలాల్లో చిరుత పులి అడుగు జాడలు కనిపించడంతో పులి సంచరించినట్లు గ్రామ ప్రజలు గుర్తించారు. పొలాల్లో పులి అడుగు జాడలు గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారులు ఎఫ్ఎస్ఓ జమాల్ బాషా, శ్రీనివాస్ రెడ్డి లు సంఘటన స్థలానికి చేరుకొని అడుగుజాడలను బట్టి పులి సంచరించినట్లు నిర్ధారించారు. ఆ ప్రాంతంలో స్పాట్ కెమెరాలు ఏర్పాటు చేసి తక్షణమే బోన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం ప్రజలు గుంపులుగా ఉంటూ తగు జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిరుత పులి సంచరిస్తున్నట్లు నిర్ధారణ కావడంతో చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు.

యథేచ్ఛగా మట్కా

జోరుగా విస్తరిస్తున్నా పట్టించుకోని పోలీసులు

ప్రజాశక్తి - గిద్దలూరు



మహమ్మారిలా మట్కా విస్తరిస్తోంది. సులభంగా డబ్బు సంపాదించాలనే ధోరణి పెరిగాక యువత మట్కాలో కూరుకపోతోంది. గిద్దలూరు నియోజకవర్గంలో చట్ట వ్యతిరేకమైన జూదం విచ్చలవిడిగా పెరిగిపోయింది. పోలీసులు అడ్డుకోలేకపోతున్నారనే విమర్శ వినిపిస్తోంది. అనేక కంపెనీలు మట్కా నిర్వహిస్తూ డబ్బులు కాజేస్తున్నాయి. ఈ వ్యసనంతో యువత జీవితాన్ని నాశనం చేసుకుంటోంది. మట్కాలో రోజుకు రెండుసార్లు ఫలితాలు వెల్లడి కాగా, ఉదయం 10 లోపు వచ్చే రిజల్ట్స్, రాత్రి 12 గంటలకు వచ్చే రిజల్ట్స్ కోసం బెట్టింగ్ రాయుళ్లు ఎదురుచూస్తుంటారు.

మట్కా మత్తులో యువత జీవితాలను చిన్నా భిన్నం చేసుకుంటోంది. మట్కాకు ఒకసారి బానిస అయితే కుటుంబం పూర్తిగా నాశనమయ్యేదాకా దాన్నుంచి బైటపడలేరు. గిద్దలూరు పట్టణంలో అనేక ఏళ్లుగా మట్కా కొనసాగుతున్నది. ఒక్క రూపాయి పెట్టుబడితో రూ.80 వస్తాయనే ఆశ వారిని మట్కా వ్యసనంలో కూరుకపోయేలా చేస్తున్నది. ఆర్థికంగా దిగజార్చుతున్నది. గతంలో అనేక మార్లు పోలీసులు మట్కా జూదంపై దాడులు నిర్వహించి, నిర్వాహకులపై కేసులు నమోదు చేసినప్పటకి వారి పంథా మారడం లేదు. తాజాగా పట్టణంలో పలు చోట్ల మట్కా నిర్వాహకులను అరెస్ట్ చేసినప్పటికీ మట్కా బుకింగ్ యథేచ్ఛగా సాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గెలిచిన వారు సులభంగా డబ్బులు వచ్చాయన్న సంతోషంలో మద్యానికి బానిసలవుతుంటే, ఓడిన వాడు డబ్బులు కోల్పోయానన్న బాధలో మద్యానికి బానిసలవుతున్నారు. ఒకసారి రూ.100తో రూ.8000 గెలిచినవారు, మరోసారి రూ. 1000లతో రూ.80,000 వేలు గెలవాలన్న ఆశతో, మరింత డబ్బును అందులో వెచ్చిస్తున్నారు. ఆ తర్వాత ఆశించిన డబ్బు రాకపోగా సర్వస్వం కోల్పోయి ఖాళీ జేబులతో నడిరోడ్డున నిలబడుతున్నారు. 'పోయిన చోటే రాబట్టాలన్న' కసితో, మనకూ ఓ రోజు వస్తుందన్న ఆశతో అప్పులు చేసి మరీ మట్కాలో డబ్బులు పెడుతున్నారు. చివరికి అప్పుల ఊబిలో పడి ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు, దొంగలుగా మారిన సంఘటనలు ప్రకాశం జిల్లాలో ఉన్నాయి. అత్యధిక కమిషన్లు వస్తుండటంతో ఏజెంట్లు అదేపనిగా జూదరుల సంఖ్య పెరిగేలా చూస్తున్నారు.

గిద్దలూరు పట్టణంలో ఏజెంట్లు అధికం...

గిద్దలూరు పట్టణంలో మట్కా డాన్‌లుగా చలామణి అవుతున్న వారు కొందరు ఉన్నారు. పోలీసులు దాడులు నిర్వహిస్తారనే సమాచారం వీరికి ఆ శాఖ నుంచే వస్తోందనే విమర్శలు ఉన్నాయి. కొత్త ప్రభుత్వంలో మట్కారాయుళ్ల మీద, నిర్వాహకుల మీద దాడులు జరపమని అంటున్నారు. అలాంటి ఆదేశాలు రాగానే కింది స్థాయి అధికా రులు దాడులు జరిపి తూతూ మంత్రంగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పైగా తిమింగలాలను వదిలేసి చిన్న బీటర్లను పట్టుకొచ్చి డబ్బులు సీజ్ చేస్తున్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. నియోజకవర్గంలోని గిద్దలూరు, కంభం పట్టణాలలో కొంత మంది ఏజెంట్లు మట్కా వ్యాపారాన్ని యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. యువకులు, పెద్దలు ఈ జూదానికి బానిసలుగా మారుతున్నారు. మరోవైపు పట్టణానికి చెందిన కొందరు వ్యాపారులు ఆన్‌లైన్ ద్వారా మట్కా జూదం నడుపుతున్నారు. మట్కా మహమ్మారిపై పోలీసులు ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చర్యలు తీసుకుంటాం - అర్బన్ సీఐ సోమయ్య

మట్కా నిర్వాహకుల పై తప్పక చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పలు ప్రాంతాలలో మట్కా నిర్వహించే వారి కోసం నిఘా ఉంచాం. మట్కా నిర్వాహకులపై ఖచ్చితంగా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.


సిరాజ్‌బాషాను అభినందిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి

ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి-బాపట్ల

విద్యారంగంలో ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో ఎందరో విద్యార్థులు స్వయంకృషి, పట్టుదలతో సాధన చేసి అత్యున్నత చదువులతో పీహెచ్‌డిలు సాధిస్తున్నారని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు అన్నారు. బుధవారం బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలంలో చందోలు శివారు నదిముల్లాయపాలెం గ్రామానికి చెందిన డాక్టర్ సిరాజ్‌భాషా పిహెచ్‌డి పొందిన సందర్భంగా గ్రామంలో జరిగిన కార్యక్రమం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ప్రధానమైన లక్ష్యాల్లో ఒకటైన విద్యారంగంలో మనం చాలా వరకు విఫలం చెందామనే చెప్పాలన్నారు. ఒక్క సిలబస్లో మార్పులు చేసినంత మాత్రాన మనకి మంచి విద్య అందుతుందనే భావన నుండి బయటపడాలన్నారు. విద్య కోసం డబ్బు ఖర్చు అవుతోందని, కానీ అందుకు తగిన విద్యా ప్రమాణాలు పెరగడం లేదన్నారు. కేవలం మార్కుల కోసం చదువుతున్నామని, మన ప్రభుత్వాలు విద్య మీద ఉపన్యాసాలు ఇవ్వడం తప్పితే ప్రమాణాలు మెరుగుపడే విధంగా పని చెయ్యట్లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలూ మెరుగుపడాలన్నారు. ఉపాధ్యాయులు ఖచ్చితంగా ఉండేటట్టు చూడాలన్నారు. పాఠశాలకు ఏదో పిల్లలని పంపేస్తున్నామని కాకుండా తల్లిదండ్రులు స్కూల్ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. ప్రభుత్వ విద్యలో తల్లిదండ్రుల భాగస్వామ్యం కొరవడిందన్నారు. ప్రైవేట్ పాఠశాలల మాదిరిగా ఉపాధ్యాయుల, విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాలు పాఠశాలల్లో జరగాలన్నారు. పాఠశాలల్లో సౌకర్యాలు సక్రమంగా లేకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రశ్నించేతత్వం పెరగాలన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతంలో విద్యనభ్యసించి పీహెచ్‌డి పట్టా పొందిన సిరాజ్ భాషాను ఈ సందర్భంగా లక్ష్మణరావు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిస్టీ, విశ్రాంత ఉపాధ్యాయులు కష్ణమూర్తి, ఎండి రియాజ్ అహ్మద్, యుటిఎఫ్ నాయకులు, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతమైన సేవలందిస్తాం..

- మహిళలకు, చిన్నపిల్లలకు సంబంధించిన నేరాలపై ప్రత్యేక దృష్టి
- గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిరోధం కోసం త్వరలో హెల్ప్ లైన్
- బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి


కుటుంబసభ్యులతో ఎస్పీ తుషార్ డూడి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లా ప్రజలకు నిష్పక్షపాతమైన సేవలు అందిస్తూ ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తామని, మహిళలకు, చిన్నపిల్లలకు సంబంధించిన నేరాల మీద ప్రత్యేక దష్టి సాధిస్తామని బాపట్ల ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా పోలీస్ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి జిల్లాలోని శాంతిభద్రతల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ పాత్రికేయులతో మాట్లాడుతూ ఐపీఎస్ ట్రైనింగ్ అనంతరం మొదటగా కర్నూలు జిల్లాలో ట్రైనింగ్ ఎస్పీగా పనిచేసి, అనంతరం అసాల్ట్ కమాండర్‌గా, చింతపల్లి ప్రాంతానికి అడిషనల్ ఎస్పీగా, కడప జిల్లా అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహించానన్నారు. ఎన్నికల సమయంలో 2024 ఫిబ్రవరిలో గుంటూరు ఎస్పీగా బాధ్యతలు చేపట్టి ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించామని తెలిపారు. అనంతరం ఇటీవల జరిగిన సాధారణ బదిలీలో భాగంగా బాపట్ల జిల్లాకి కేటాయించబడినట్లు తెలిపారు. మహిళలు, చిన్నపిల్లల పట్ల జరిగే నేరాలు మీద ప్రత్యేక దష్టి పెడతామని, పెండింగ్ కేసుల విచారణలో సాంకేతికతను జోడించుకొని వేగంగా దర్యాప్తు చేస్తామని, సముద్ర తీర ప్రాంతంలో భద్రతాచర్యలపై మరింత దష్టి పెడతామని పేర్కొన్నారు. జిల్లా ప్రజలకు నిష్పక్షపాతమైన సేవలు అందిస్తూ ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా పోలీస్‌స్టేషన్‌కి వచ్చి వారి సమస్యలు చెప్పుకొనే విధంగా చూస్తామన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల కట్టడి చేయడంపై ప్రత్యేక దష్టి సారిస్తామన్నారు. రాబోయే రోజులలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై, అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలియపరచడానికి హెల్ప్ లైన్ నెంబర్‌ను ప్రారంభిస్తామన్నారు. జిల్లా ప్రజలు చట్ట వ్యతిరేక కార్యకలాపాలు గురించిన సమాచారం పోలీస్ శాఖకు అందించాలని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని తెలిపారు. జిల్లా ప్రజలు, మీడియా మిత్రులు పోలీస్ వారికి సహకరించాలని కోరారు. అనంతరం అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేస్వర్, రేపల్లె డిఎస్పీ టి.మురళీకష్ణ, బాపట్ల డిఎస్పీ సిహెచ్.మురళీకష్ణ, చీరాల ఇన్‌ఛార్జి డీఎస్పీ పి.జగదీష్ నాయక్, జిల్లాలోని సిఐలు, ఎస్‌ఐలు తదితరులు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాలు ఆందజేశారు.

దళితులంతా ఐక్యంగా ఉండాలి..

కారంచేడు మృతవీరులకు ఘన నివాళి

ప్రజాశక్తి-చీరాల

కారంచేడు మతవీరుల దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని విజయనగర కాలనీ గ్రామంలో రుద్ర క్షేత్రం వద్ద 39వ సంస్మరణ సభను గ్రామ పెద్దలు నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత, ప్రజాసంఘాల నాయకులు కారంచేడు మృతవీరులకు ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దళితులందరూ ఐక్యంగా ఉండాలన్నారు. ఐక్యతా లోపంతోనే దళితులపై పెత్తందార్లు దాడులకు తెగబడుతున్నారని పేర్కొన్నారు. కారంచేడు ఘటనలో దళితులు, ఇతర ప్రజాసంఘాలు పెద్దఎత్తున చేసిన ఐక్య ఉద్యమ ఫలితంగానే నేడు విజయనగర కాలనీ ఏర్పడిందని గుర్తుచేశారు. కావున దళితులు అందరం ఐక్యమత్యంగా ఉంటూ జరుగుతున్న దాడులను వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా కాలనీలో మృతవీరుల దినోత్సవ ర్యాలీని నిర్వహించి రుధిర క్షేతరం వద్ద మృతవీరులకు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం విప్లవ కళాకారుడు గద్దర్ గతంలో కారంచేడు ఘటనపై పాడిన 'దళిత పులులమ్మ' పాటను చైతన్య స్వరభారతి అధ్యక్షులు నూకతోటి శరత్ తిరిగి ప్రస్తుత సాంకేతిక వాయిద్యాలతో స్వయంగా పాడి ఆ పాటను ఆవిష్కరించారు. దుడ్డు భాస్కర్ రావు సభా అధ్యక్షతన జరిగిన సమావేశంలో తేళ్ళ వెంకటస్వామి, దుడ్డు సుందరరావు, నూకతోటి బాబూరావు, కపాకర్ మాదిగ, బాబూరావు, పిల్లి మాణిక్యారావు, భగత్‌సింగ్, తేళ్ల రవికుమార్, తేళ్ల సుబ్బారావు, బుడంగుంట్ల లక్ష్మి, నరసయ్య మాదిగ, గొర్రెపాటి రవి, వంగెవరపు రమేష్, గ్రామ పెద్ద తేళ్ల లక్ష్మి ప్రసాద్, తేళ్ల దేవదానం, తేళ్ల ప్రసాద్, కంచర్ల చిట్టిబాబు, దుడ్డు ఏసుపాదం, తేళ్ల లక్ష్మయ్య, చుండూరి వీరయ్య, బొంత అంకయ్య, జోసఫ్, తేళ్ల సైమన్, నాగేంద్ర, కాటి మార్క్, దుడ్డు వెంకటేశ్వర్లు, తేళ్ల బోయేజు పాల్గొన్నారు.


రుద్రక్షేత్రం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

మృతవీరులకు నివాళులర్పించిన సిపిఎం

కారంచేడు మృతవీరుల దినోత్సవం సందర్భంగా బుధవారం విజయనగర కాలనీలో ఉన్న రుద్రక్షేత్రం వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య, ఎన్.బాబూరావు, ఎం.వసంతరావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాలనీ గ్రామ పెద్దలు ఏర్పాటుచేసిన 39వ సంస్మరణ కార్యక్రమానికి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ కారంచేడు ఘటన దేశ చరిత్రలో ఎప్పటికీ నిలిచి ఉంటుందన్నారు. దళితులపై అనేక చోట్ల నేటికీ దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను కట్టుదిట్టం చేసి దళితులకి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శిగా 'విజయ '

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఒంగోలు నగర అధ్యక్ష, కార్యదర్శులుగా గడ్డం నరసింహా, తేళ్ల విజయ ఎన్నికయ్యారు. యూనియన్ నగర ఆరో మహా సభ మంగళవారం జరిగింది. సభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షునిగా టి మహేష్, ఉపాధ్యక్షులుగా సిహెచ్.సింహాద్రి, రత్నకుమారి, కుకామాను శ్రీదేవి, కె సామ్రాజ్యం, పి కోటేశ్వరరావు, కుంచాల వెంకట్రావు, సహాయ కార్యదర్శులుగా కొర్నెపాటి శ్రీనివాసరావు, కాకుమాను వెంకటేశ్వర్లు, బి భారతి, ఎం శ్రీలక్ష్మి, కె వంశీతోపాటు 32మంది కమిటి సభ్యులుగా ఎన్నియ్యారు. ఈ మేరకు నూతన కమిటిని ఏకగ్రీవంగా సభ ఆమోదించింది.


విజయ నరసింహా

మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఆప్కాస్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంజినీరింగ్ కార్మికులకు అర్హతలను బట్టి వేతనాలు ఇవ్వాలని, రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, క్యాబ్ డ్రైవర్లకు నెలకు వేతనం రూ.18,500 ఇవ్వాలని, పట్టణ విస్తీర్ణం మేరకు కార్మికుల సంఖ్యను పెంచాలని, కార్మికుల రక్షణకు చట్టాలను అమలు చేయాలని, పని భద్రత కల్పించాలని, పని ముట్లు ఇవ్వాలని, మస్టర్ పాయింట్లలో మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలని, కోవిడ్ కార్మికులందరినీ ఆప్కాస్‌లో చేర్చాలని సభలో తీర్మానించారు. తీర్మాణాల అమలుకు ఐక్యంగా పోరాడలని సభలో నిర్ణయించారు.

శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడను

- మాదక ద్రవ్యాల నిర్మూలనకు చర్యలు
- బాధ్యతలు స్వీకరించిన ఎస్‌పి ఏఆర్.దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్


ఎస్పీ దామోదర్‌తో మాట్లాడుతున్న దామచర్ల, మాగుంట

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో ఎక్కడా రాజీ పడనని ఎస్‌పి ఏఆర్ దామోదర్ స్పష్టం చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ప్రకాశం జిల్లా ఎస్‌పిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌పిని అదనపు ఎస్‌పి (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, అదనపు ఎస్‌పి (క్రైమ్) ఎస్‌వి.శ్రీధర్‌రావు, ఏఆర్ అదనపు ఎస్‌పి అశోక్‌బాబు, అన్ని సబ్ డివిజనల్ డిఎస్‌పిలు, సిఐఆలు, ఆర్‌ఐలు, ఎస్సైలు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రకాశం జిల్లాతో మంచి అనుబంధం ఉందని, ఒంగోలులో ప్రొబేషనరీ డిఎస్‌పిగా, విజయనగరం జిల్లా ఎస్‌పిగా, ఒంగోలు పోలీస్ శిక్షణ కళాశాల ఎస్‌పిగా పనిచేశామన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ విషయంలో ఎటువంటి రాజీ పడేది లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా భావిస్తున్న గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయిని అరికట్టడానికి తల్లిదండ్రులు, కళాశాలల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు పోలీసులకు సహకారం అందించాలని కోరారు. సైబర్ నేరాలపై ప్రత్యేక దష్టి సారిస్తామన్నారు. నేరాలు, చట్టవ్యతిరేక/అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించినా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డుప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దష్టి సారిస్తామని, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తామన్నారు. సిబ్బంది సమస్యల పరిష్కారంలో ఎల్లవేళలా కషి చేస్తానని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని రకాల చర్యలూ తీసుకుంటామన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు 24 గంటలు అందుబాటులో ఉంటానని ఎస్‌పి స్పష్టం చేశారు. అందరి సహకారంతో జిల్లాను నేర రహితంగా నిలిపేందుకు, పోలీసులు సేవాభావంతో ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కషి చేస్తామన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు, ప్రజలు, పాత్రికేయులందరూ సహాయ సహకారాలు అందించాలని జిల్లా ఎస్‌పి కోరారు. సమావేశంలో ఎస్‌పిని అదనపు ఎస్‌పి (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, అదనపు ఎస్‌పి (క్రైమ్) ఎస్‌వి.శ్రీధర్ రావు, ఏఆర్ అదనపు ఎస్‌పి అశోక్ బాబు పాల్గొన్నారు.


ఎస్పీ దామోదర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏఎస్పీ నాగేశ్వరరావు

ఎస్‌పిని కలసిన దామచర్ల, మాగుంట

జిల్లా ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన ఏఆర్ దామోదర్‌ను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్‌పిని కలిసి.. ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ పాల్గొన్నారు.